ప్రజాశక్తి
శనివారం 27 ఏప్రిల్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బకాయిల బండతో..

అంతంతగానే ఆరోగ్య శ్రీ సేవలు

- విశాఖ జిల్లాలో 79 ఆసుపత్రుల్లో పథకం అమలు
- సర్కారు చెల్లించాల్సిన రూ.60 కోట్లకు అతీగతి లేనివైనం
- కార్పొరేట్ ఆసుపత్రుల్లో వెంటిలేటర్‌పై రోగులకు వర్తించని పథకం
- రూ.లక్షల్లో వ్యయం భరించలేమంటున్న రోగులు

హెల్త్‌సిటీలోని ఓ ఆసుపత్రి వద్ద ఆరోగ్యశ్రీ సేవల అమలు తీరును వెల్లడిస్తున్న రోగుల కుటుంబీకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

బకాయిల బండతో ఆరోగ్య శ్రీ సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి. అత్యధిక కేసులు విశాఖ జిల్లాలోని కార్పొరేట్ ఆసుపత్రులకు వస్తున్నా ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై శ్రద్ధ వహించడం లేదు. విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందుతున్న ఆరోగ్య శ్రీ సేవలకుగానూ ప్రభుత్వం నుంచి రూ. 60 కోట్లకుపైగా రావాల్సి ఉంది. అంత పెద్ద మొత్తంలో బకాయిలు ఉండటంతో ఈ పథకం అమలులో ఆసుపత్రుల యాజమాన్యాలు అనేక షరతులు విధిస్తున్నాయి. వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు పథకాన్ని వర్తింపజేయడం లేదు. విశాఖలోని ఆరిలోవ హెల్త్ సిటీలో పలు ఆసుపత్రుల్లో ఇదే తంతు సాగుతోంది. దీంతో ఆసుప త్రులకు వచ్చిన రోగులకు అనివార్యంగా చేతిచమురు వదులుతోంది.

విశాఖ హెల్త్ సిటీ ఆసుపత్రుల్లో ఏం జరుగుతోందంటే?

శుక్రవారం విశాఖలోని హెల్త్‌సిటీ ప్రాంగణంలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో పేషెంట్ల పరిస్థితిని 'ప్రజాశక్తి' పరిశీలించగా పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సర్వసిద్ధి పెంటయ్యను ఈ నెల 21న ఆనందపురం మండలం శొంఠ్యాం నుంచి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన కారణంగా ఆసుపత్రిలో చేర్పించారు. ఆ ఆసుపత్రికి ఆరోగ్య శ్రీ వర్తిస్తుంది. ఆయనకు ఆరోగ్య శ్రీ కార్డు ఉంది. తెల్లరేషన్ కార్డుదారుడు. మూడు రోజులయ్యాక గురువారం వెంటిలేటర్‌పై పేషెంట్‌ను పెట్టాలని, లేదంటే కెజిహెచ్, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని ఆసుపత్రి యాజమాన్యం సలహా ఇచ్చింది. ఇప్పటికిప్పుడు అత్యవసర పరిస్థితుల్లో వేరే ఆసుపత్రులకు తీసుకెళ్లలేమని పేషెంట్ కొడుకు అప్పలస్వామి యాజమాన్యంతో చెప్పాడు. వెంటిలేటర్‌పై పెట్టిన వారికి ఆరోగ్యశ్రీ వర్తించదంటూ యాజమాన్యం చెప్పడంతో అప్పలస్వామి అవాక్కయ్యాడు. వెంటిలేటర్ లేకపోతే ప్రమాదమని మళ్లీ వారే చెప్పారు. మద్యం తాగే అలవాటు రోగికి ఉన్నందున ఊపిరితిత్తులు బాగా పాడయిపోయాయని వైద్యులు తెలపడంతో ఏమీ పాలుపోక వైద్యం ప్రారంభించాలని ఆసుపత్రి వైద్యులకు మిగతా 2లో..

నామినేషన్ల పరిశీలనలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్ఒ మల్లికార్జున, తదితరులు

సజావుగా నామినేషన్ల పరిశీలన

- విశాఖ పార్లమెంటు స్థానంలో 33 ఆమోదం, ఐదు తిరస్కరణ
- అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో 22 ఆమోదం, మూడు తిరస్కరణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, పెందుర్తి, కలెక్టరేట్ విలేకరులు, అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శు క్రవారం చేపట్టిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం సజావుగా సాగింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి దాఖలైన మొత్తం 39 నామినేషన్లలో 33 పత్రాలకు పార్లమెంటు నియోజకవర్గ ఆర్ఒ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆమోదం తెలిపారు. అర్హత లేని ఐదు నామినేషన్ పత్రాలను నిబంధనలను అనుసరించి తిరస్కరించారు. ఒక దానిపై విచారణకు ఆదేశించారు. పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆర్ఒ, జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం నామినేషన్ల పరిశీలనా ప్రక్రియను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ ప్రక్రియలో ఒక్కో నామినేషన పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకున్నారు. అఫడివిట్ పత్రంలో సంతకం చేయని కారణంగా మిగతా 2లో..

గాలి జనార్ధన్ రెడ్డి నుంచి ప్రాణహాని : వివి.లక్ష్మీనారాయణ

వార్త మెయిన్‌లో..

విశాఖ రైల్వే జోన్‌పై పీయూష్ గోయల్‌వి అబద్ధాలు

వార్త మెయిన్‌లో..

సమస్యల పరిష్కారంలో గంగవరం పోర్టు నిర్లక్ష్యం

వార్త 8లో..

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం రోడ్డు - తిరుపతి, కొచ్చువేలి - బరౌని - కొచ్చువేలి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు 07440 తిరుపతి - శ్రీకాకుళం రోడ్ స్పెషల్ మే 5, 12 తేదీల్లో రాత్రి 20.05 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 08.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 07441 శ్రీకాకుళం రోడ్డు -తిరుపతి ప్రత్యేక రైలు మే 06, 13 తేదీలలో మధ్యాహ్నం 15.00 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి సాయంత్రం 18:38 గంటలకు దువ్వాడ చేరుకుని 18.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరుపతి, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా ప్రయాణిస్తాయి.

06091 కొచ్చువేలి నుంచి బరౌని సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 04 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం అర్ధరాత్రి 01.30 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 10.50 గంటలకు బయలుదేరి సోమవారం 13.55 గంటలకు బరౌని చేరుకుంటుంది. 06082 బరౌని - కొచ్చువేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బరౌనిలో మే 7 నుండి జూలై 2 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 15.30 గంటలకు బయలుదేరుతుంది. ఇది మరుసటి రోజు ఉదయం 04.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 04.20 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 9:55 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్ పరిధిలో దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా ప్రయాణిస్తాయి.

పశ్చిమంలో 'రాజకీయ కూపన్లు'

- సంబంధిత వ్యక్తులపై కేసులు : జెసి

ప్రజాశక్తి - విశాఖపట్నం : సాధారణ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో నగరంలోని కొంతమంది వైసిపికి చెందిన వారు 860 మందికి పెట్రోల్ కూపన్లు ఇచ్చిన వైనంపై రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు శు క్రవారం రాత్రి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19న పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్ఎడి జంక్షన్‌లోగల టర్బానీ పెట్రోలియం ప్రొడక్ట్స్ పెట్రోల్ బంకును తనిఖీ చేయగా వైసిపికి చెందిన వ్యక్తుల ద్వారా ఈ కూపన్లు పంచిపెట్టినట్టు తేలిందని, వందల మందికి పెట్రోల్ పోయడం ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని జెసి ధ్రువీకరించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసేందుకు స్థానిక రిటర్నింగ్ అధికారిని కోరినట్లు పేర్కొన్నారు.

వడ్లపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, తదితరులు

జోరుగా జగ్గునాయుడు ప్రచారం

గాజువాకలో ఎక్కడికక్కడ అపూర్వ స్వాగతం వార్త సెంటర్ స్ప్రెడ్‌లో..

మొదటి పేజీ తరువాయి..

అంతంతగానే ఆరోగ్య శ్రీ సేవలు

తాను చెప్పినట్లు అప్పలస్వామి 'ప్రజాశక్తి'కి వివరించారు.

విశాఖ జిల్లాలో ఎన్ని ఆసుపత్రులకు ఎక్కడెక్కడ ఆరోగ్య శ్రీ ఉంది

విశాఖపట్నం జిల్లాలోని మొత్తం 60 కార్పొరేట్ ఆసుపత్రులుండగా 19 ప్రభుత్వ ఆసుపత్రులున్నాయి. వీటన్నింటిలోనూ ఆరోగ్య శ్రీ అందుబాటులో ఉంది. ఈ ఆసుపత్రుల్లో ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకూ 18501 మంది రోగులకు చికిత్స అందించారు. దీనికి మొత్తంగా రూ.34 కోట్లు 86 లక్షల 83 వేల 139 రావాల్సి ఉంది. ఆ బకాయిని ప్రభుత్వం విడుదల చేయలేదు. అలాగే మార్చి 16 నుంచి ఏప్రిల్ 26 వరకూ ఆరోగ్య శ్రీ పరిధిలో 15128 మందికి పలు రకాల చికిత్సలు, వైద్యం అందించారు. ప్రభుత్వం నుంచి రూ.26 కోట్ల 63 లక్షల 11 వేల 655 బకాయి రావాల్సి ఉంది. మొత్తంగా 79 ఆసుపత్రుల్లో విశాఖ జిల్లాలో ఆరోగ్య శ్రీ అందుబాటులో ఉన్నా ప్రభుత్వం నుంచి డబ్బులు రావడం లేదు.

సజావుగా నామినేషన్ల పరిశీలన

స్వతంత్ర అభ్యర్థి మెహబూబ్ సుభాన్ నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ఆర్ఓ ప్రకటించారు. ఫార్మాట్ ప్రకారం దరఖాస్తు సమర్పించ లేనందున స్వతంత్ర అభ్యర్థి వియ్యపు గంగరాజు నామినేషన్, జై భీంరావు భారత్ పార్టీ అభ్యర్థిని నక్క నమ్మిగేస్ నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే టిడిపి, వైసిపి ప్రధాన అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన మతుకుమిల్లి తేజశ్విని, బొత్స అనూషల నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా బ్లూ ఇండియా పార్టీ తరఫున మురాల అరుణశ్రీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి దేవర శంకర్ వేసిన నామినేషన్లలో ఫాం-ఎ, ఫాం-బి పత్రాలు సరిగ్గా లేని కారణంగా ప్రపోజల్స్ సంతకాలను పరిగణనలోకి తీసుకొని స్వతంత్ర అభ్యర్థులుగా గుర్తించి ఆర్ఓ ఆమోదం తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పట్టపగలు రాజా రమేష్ పత్రాల్లో ప్రపోజల్స్ సంతకాలన్నీ ఒకేలా ఉండటంతో ఆర్ఓ అభ్యంతరం వ్యక్తం చేసి సంబంధిత అభ్యర్థిని వివరణ కోరారు. సంతృప్తి చెందని ఆర్ఓ సంబంధిత సంతకాల ధ్రువీకరణపై విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 118 నామినేషన్లకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుండి 15, పశ్చిమ నియోజకవర్గం నుండి 16, దక్షిణ నియోజకవర్గం నుండి 19, ఉత్తర నియోజకవర్గం నుండి 16, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుండి, 17 గాజువాక నియోజకవర్గం నుండి 16, పెందుర్తి నియోజకవర్గం నుంచి 19 నామినేషన్లను ఆమోదించినట్లు సమాచారం.

అనకాపల్లి లోక్‌సభకు నామినేషన్ దాఖలు చేసిన 25 మంది అభ్యర్థుల్లో ముగ్గురు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో వైసిపి నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థిగా నామినేషన్ వేసిన డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి నామినేషన్ తిరస్కరించి, ప్రధాన అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు నామినేషన్ ఆమోదించారు. బిజెపి నుంచి సిఎం రమేష్ నామినేషన్‌ను ఆమోదించి ఆయన భార్య సిఆర్ శ్రీదేవి నామినేషన్ తిరస్కరించారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలుచేసిన రమేష్ నాయుడు గొలగాని పది మంది ప్రతిపాదించకపోవడంతో ఇతని నామినేషన్ చెల్లుబాటుకాలేదు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 90 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 140 సెట్లు నామినేషన్లలో 15 నామినేషన్లు తిరస్కరించారు. 75 నామినేషన్లను ఆమోదించారు. అనకాపల్లిలో నమోదైన 15 నామినేషన్లలో మూడు, నర్సీపట్నం నుంచి 10 నామినేషన్లలో రెండు, చోడవరం నుంచి 15 నామినేషన్లలో రెండు, మాడుగుల నుంచి 14 నామినేషన్లలో మూడు, యలమంచిలి నుంచి 18 నామినేషన్లలో నాలుగు, పాయకరావుపేట నుంచి 18 నామినేషన్లకు ఒక నామినేషన్ చొప్పున తిరస్కరించబడ్డాయి.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డుకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు శుక్రవారం కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. కొత్త నక్కవానిపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపిలో కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తా సైనికుడిగా పనిచేసి ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు అధ్యక్షులు జెవిఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), జెసిఎస్ క్లస్టర్ -1 కన్వీనర్ బోగవల్లి నాగభూషణం, డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద, చిన్న బజారు బస్టాప్ వద్ద శుక్రవారం మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. చిన్న బజారు బస్టాప్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ జి.హరీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

నేడు మన్యంలో షర్మిల పర్యటన

- పాడేరులో బహిరంగ సభ - హుకుంపేటలో రోడ్ షో

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో ఈనెల 27న శనివారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్ షో నిర్వహించనున్నారని ఇండియా ఫోరం నేతలు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు.అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్‌స్వామిల గెలిపించాలని కోరుతూ స్థానిక మోద కొండమ్మ తల్లి గుడి నుండి పెట్రోల్ బంక్, జె సీ ఈ ఎఫ్ చర్చ్, మసీదు మీదుగా మెయిన్ రోడ్డు, సంత కామయ్యా పేట జంక్షన్ వరకు షర్మిల రోడ్ షో జరగనుందని, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ఆకస్మిక తనిఖీలు చేస్తున్న జెసిపి, ఇతర పోలీసు అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో విశాఖ జాయింట్ సిపి ఫకీరప్ప నగరంలోని ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోగల కృష్ణా కాలేజ్, ఇతర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆకస్మాత్తుగా పరిశీలించారు. అక్కడ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా గట్టి చర్యలు చేపట్టాలని తెలిపారు.

జోరుగా వాసుపల్లి ఎన్నికల ప్రచారం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 27వ వార్డు వైసిపి నాయకులు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దొండపర్తి జంక్షన్‌లో శ్రీ ఎరుకుమాంబ ఆలయంలో పూజలు చేసి ప్రచార ర్యాలీ ప్రారంభించారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మాజీ కార్పొరేటర్ జివి.రవిరాజు, పద్మనాభం అమ్మాజీ తదితర ముఖ్య నాయకులు పాల్గొని వాసుపల్లితో పాటు ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి కుండబద్దలు కొడతామని, దక్షిణంలో అత్యధికంగా ఉండే మైనారిటీలు తమకు అండగా నిలవనున్నారని తెలిపారు. ప్రచారంలో ఎమ్మెల్యే వాసుపల్లి కుమారుడు వాసుపల్లి సూర్య, కోడలు రాశి, పార్టీ దక్షిణ పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, డాక్టర్ మూగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సామాజికం' సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేద ప్రజలకు విద్య, వైద్యం, అభివృద్ధే తమ లక్ష్యమని రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం అధ్యక్షులు డి.మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌టిఎన్ రావూరి సుబ్బారావు నేతృత్వంలో 'సామాజికం' పేరిట సిఎస్ఆర్ సదస్సు 2024ను నగరంలోని నొవాటెల్ హోటల్‌లో శనివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిరుపేద, మహిళలు, చిన్నారులు, అనాథలు వంటి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలను స్వయంగా అందించడమే ధ్యేయంగా సదస్సులో చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ ముంబయి సాయిశంకర లండా హాజరుకానున్నారని, ప్రత్యేక అతిథులుగా పిడిజి శ్యామ్యవ్య, సంజాయ్ పర్వర్, ఆర్.వెంకటరమణ హాజరై చర్చిస్తారన్నారు. రోటరీ కార్యదర్శి పి.వి.రఘుపతి మాట్లాడుతూ గర్దెన్ ఆర్.మేషినల్లి, సుబ్బారావు రావూరి చైతన్యవంతమైన అంశాలను తీసుకోవాల్సిన ప్రణాళికలపై మాట్లాడుతారన్నారు. ఈ సమావేశంలో రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత చైతన్య యువజన పార్టీ మ్యానిఫెస్టో ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత చైతన్య యువజన పార్టీ విశాఖ ఎంపి అభ్యర్థి డాక్టర్ మురపాల బాలాజీ యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ మ్యానిఫెస్టోను శుక్రవారం ఆవిష్కరించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు, ఎన్నికల దృష్ట్యా, అందరికీ మేలు కలిగే విధంగా, భావితరాలకు మంచి భవిష్యత్‌ను ఇచ్చే నాయకత్వం కోసం తమ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎడ్ల వేణుగోపాల కృష్ణ, పార్టీ నాయకులు సాయికృష్ణ, బి.సాయి కిరణ్, మైదానం రమణమ్మ పాల్గొన్నారు.

'విశాఖ' క్యాంపస్ డ్రైవ్‌లో 28 మంది ఎంపిక

ప్రజాశక్తి-పెందుర్తి : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం స్పైడర్స్ కంపెనీ ఆధ్వర్యాన క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో 28 మంది ఎంపికైనట్లు కళాశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. సంవత్సరానికి రూ.3.50 లక్షల వేతన ప్యాకేజీతో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తులసినాయుడు అభినందించారు.

నూకాంబిక విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి అరుంధతినగర్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, అన్న సమారాధన నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంఠిపాము కామేశ్వరి, వసంతల అప్పారావు, కె.విజయ్, సుకుమార్, సురేష్, గోవింద్, బోగి, నరసింగ్, కనకరాజు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిశక్తి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్ కొండపై ఉన్న ఆదిశక్తి నాగమనసాదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే కుంకుమ పూజలు, గౌరీ పూజ చేపట్టారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

పశ్చిమ నియోజకవర్గం టిడిపి కూటమి అభ్యర్థి గణబాబు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత, స్థానిక టిడిపి నాయకులు నందవరపు సోములు తదితరులు పాల్గొన్నారు

మామిడిలోవలో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు ఆధ్వర్యాన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎండిఓ కె.అప్పలనాయుడు సందర్శించి మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు.

డాక్టర్ గంగునాయుడు మాట్లాడుతూ, వైద్య శిబిరాల్లో గుర్తించిన వ్యాధులకు అవసరమైతే పైఆసుపత్రులకు రిఫర్ చేసి వైద్యం అందేలా చూస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు డాక్టర్ ప్రవీణ్‌వర్మ, డాక్టర్ దిలీప్‌కృష్ణ వైద్య సేవలందించారు. ఈ శిబిరంలో 223 మందికి వివిధ వ్యాధులకు చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విక్రయ ప్రకటనను నిర్ణయించుటకు కుదిర్చిన దినమును గురించి నోటీసు
(21వ ఆర్డరు 64వ విధి)
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, గాజువాక
O.S. 112/2010 E.P. 80 / 2017

Chapala Appanna . . . వాది
యొదిని
Perla Ramana & 3 others
. . . ప్రతివాది

JDR-4 :
Ummidi Mangamma,
W/o. Mahesh, D/o. Ramana (L)
D.No. 15-3-37, Gangavaram
Visakhpatnam.

పైగా చెప్పబడిన వ్యాజ్యములో డిక్రీని పొందిన వారు అయిన, వాది జప్తుకాబడిన స్థిర / చర ఆస్తి యొక్క విక్రయమునకు గాను మనవిచేసుకొన్నాడు. గనుక విక్రయ ప్రకటన యొక్క షరతులను నిర్ణయించుటకు గాను **2024వ సం॥ 05 నెల 09 తారీకు** కుదుర్చబడినదని మీకు తెలుపబడమైనది.

(బై ఆర్డర్)
P.RAMA RAO (RAMU)
Advocate, D.No. 27-2-72/15
Friends Enclave, Offical Colony,
Srinagar, Gajuawak,
Visakhapatnam-530026.
Cell : 9848603003, 8465893113

వైసిపి టీ షర్టులు పట్టివేత

ప్రజాశక్తి-ఉక్కునగరం : నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న వైసిపికి చెందిన టీషర్టులను కాపు జగరాజుపేట గ్రామంలో దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం దువ్వాడ పోలీసులు వివరాలు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా కాపుజగ్గరాజుపేటలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి కనిపించడంతో అతని వద్ద తనిఖీ చేయగా వైసిపికి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఫొటోలతో కూడిన 280 టీ షర్టులు లభించాయని పోలీసులు తెలిపారు.. వాటికి సంబంధించిన రసీదులు, అనుమతులు లేని కారణంగా వాటిని స్వాధీనపరచుకున్నట్లు వివరించారు. ఆ టీ షర్టులను తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు వెల్లడించారు.

డిఎడ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 23 నుంచి మే 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, రుసుము చెల్లించవచ్చని ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 21 నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు పొందవచ్చని, మే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మే 30న ఫలితాలు విడుదలవుతాయని వివరించారు. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకుంటే, జూన్ 12 నుంచి కేటాయించిన డైట్ కళాశాల లో ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు www.apdeecet.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్ విజయాన్ని కాంక్షిస్తూ భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం టిడిపి స్థానిక నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పంచాయతీ అధ్యక్షులు బి.వెంకటరమణ, పార్టీ నాయకులు గాడు తాతినాయుడు, కనకల వెంకటరమణ, ఎం.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థిని రషితశ్రీని అభినందిస్తున్న ఫాబ్ ప్రతినిధులు

టెన్త్ విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్త్‌లో 595 మార్కులు సాధించిన జివిఎంసి మూడో వార్డుకు చెందిన మైలపల్లి రషితశ్రీని స్థానిక స్వచ్ఛంద సంస్థ ఫాబ్ ప్రతినిధులు శుక్రవారం భీమిలిలో అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు మైలపల్లి లక్ష్మణరావు, రాజేశ్వరితో పాటు ఫాబ్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రపంచంలో ఏయూకు ప్రత్యేక స్థానం

వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి-విశాఖపట్నం : విజ్ఞాన ప్రపంచంలో ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం ఉందని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ పరిపాలనా భవనం వద్ద వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, యువతను నిరంతరం ఉన్నతంగా తీర్చిదిద్దడానికి, వారి జీవితాలను మలచే ప్రక్రియలో వర్సిటీ పనిచేస్తోందన్నారు. గతంలో పనిచేసిన ఉపకులపతులు అందించిన ప్రమాణాలు, విలువలను నేటికీ కొనసాగిస్తున్నామని చెప్పారు. ఏయూ ప్రస్థానం నేడు అనేక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు కలిగి ఉండే విధంగా ప్రయాణం సాగిందన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసం కలిగించే విద్యను ఇక్కడ అందిస్తున్నామన్నారు. ఏయూకు ప్రతీ విద్యార్థి ప్రధానమని, నేడు ఏయూలో 59 దేశాలకు చెందిన వెయ్యిమందికిపైగా విదేశీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర అంశాలలో ప్రతి విద్యార్థికీ అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ పూర్వ వీసీలు పాల్గొని మాట్లాడారు. పలువురిని సత్కరించారు.

4వ వార్డులో గంటా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ, మంగమారిపేట, కొత్తవలస, జెవి.అగ్రహారం, నిడిగట్టు, నేరెళ్లవలస, కె.నగరపాలెం, సోమన్నపాలెం, కాపులుప్పాడ గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు స్థానిక పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ఓటర్లు ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఓటువేయాలని కోరారు. మే 13న జరుగు ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సరే టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, నాలుగో వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, నాయకులు పాసి త్రినాథ్ కుమార్, కారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

మధురవాడ : జివిఎంసి 5, 6, 7 వార్డుల నుంచి బొడ్డేపల్లి చిరంజీవి ఆధ్వర్యాన కళింగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు బగాది రమణ, మానవ ఆంజనేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి సురేష్‌తో సహ సుమారు 50 మంది టిడిపిలో చేరారు. 5వ వార్డు పరిధి శారదనగర్, గాంధీనగర్, కార్పెంటర్స్ కాలనీ చెందిన వైసిపి నాయకులు మిత్తన రమణమ్మ, ముస్లిం నాయకుడు కరీం, యువత, కన్వీనర్లు, గృహసారథులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొద్ది రోజులలో అరాచక పాలన కనుమరుగై కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, నాగోతు వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఐదేళ్లలో అరాచక పాలన నడిచిందని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు వేలుపూరి శ్రీనివాసరావు ఆరోపించారు. సీతమ్మధారలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో కబ్జాలు, సెటిల్‌మెంట్లు, మద్యం మాఫియా, ఇసుక దోపిడీలతో అరాచక పాలన సాగిందన్నారు. సొంత చెల్లికి న్యాయం చేయని ముఖ్యమంత్రి ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ, విష్ణుకుమార్ రాజును గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ఏమి చేసిందని ఓటు వేయాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు త్రినాథ్, సన్యాసినాయుడు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు స్టేడియంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజుతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో రూ.400 కోట్ల పైబడి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రహేజా గ్రూప్ వారి ఇనార్బిట్ మాల్‌ను నియోజకవర్గానికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌సింగ్, రాయుడు శ్రీను, కె.సుశీల, బల్ల శ్రీను, ఎం.సునీల్, అంబటి శైలేష్ పాల్గొన్నారు.

ప్రియదర్శిని కాలనీలో...

జివిఎంసి 23వ వార్డు పరిధి ప్రియదర్శిని కాలనీలో వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి ఆధ్వర్యాన కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడిపద్మారెడ్డి, జీవీ రమణి, కర్రి మురళీకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

జివిఎంసి 24వ వార్డు పరిధి గాంధీనగర్‌కు చెందిన బిజెపి, జనసేనకు చెందిన పలువురు యువకులు శుక్రవారం కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి కెకె.రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పేడాడ రమణ కుమారి, మువ్వల సంతోష్‌కుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

45వ వార్డులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

జివిఎంసి 45వ వార్డులో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఆధ్వర్యాన కెకె.రాజు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 45వ వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మీయ సమావేశం

జివిఎంసి 26వ వార్డు పరిధి చిన్నూరు మసీదులో ముస్లిం యువత, పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు. ముస్లిముల కోసం జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, పదవులు, ఉద్యోగాలలో సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, బులుసు జగదీష్, అనురాగ్, నవాబ్, ఖాజా, యూసఫ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : వడ్లపూడి వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో బస్సు ఢీకొని మహిళ మృతిచెందింది. దువ్వాడ పోలీసుల కథనం ప్రకారం... పరవాడ మండలం, దేశపాత్రునిపాలేనికి చెందిన పైల వరలక్ష్మి (42) వడ్లపూడి వద్ద రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి అగనంపూడి వైపు వెళు తున్న ఫార్మా కంపెనీకి చెందిన బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

అక్కాచెల్లెళ్లు అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్కాచెల్లెళ్లఅదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దీనికి సబంధించి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌కు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు మధురవాడలో పాలి టెక్నిక్ నగరంలో చదువుతున్నారు. వారిద్దరు గురువారం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

11వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగడ రాజారావు ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ పార్లమెంటు టిడిపి అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజశ్విని, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. బాలాజీనగర్, వికలాంగుల కాలనీ, అంబేద్కర్‌నగర్ ప్రాంతాల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ ప్రచారంలో టిడిపి నాయకులు మూది అప్పారావు, కృష్ణంరాజు, పేపర్ నాయుడు, లింగం సత్యనారాయణ, పాల్గొన్నారు.

ప్రచారంలో వృద్ధుడు మృతి

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వృద్ధుడు ఒక్కసారి కుప్పకూలిపోయాడు. 12వ వార్డు పరిధి పెదగదిలి కొండవాలు ప్రాంతంలో శుక్రవారం ఉదయం టిడిపి ఎన్నికల ప్రచారం సాగుతోంది. పెదగదిలి కొండవాలు ప్రాంతానికి చెందిన వేగిరెడ్డి సోమునాయుడు (75) టిడిపి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారం చేస్తుండగా సోమునాయుడు ఒక్కసారి కుప్పకూలిపోయాడు. వెంటనే విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సర్దార్ 101 ఎంపైర్ నూతన బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గాజువాక : అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న గాజువాక షీలానగర్ ప్రాంతంలో సర్దార్ ప్రాజెక్ట్ నూతన ప్రాజెక్టు సర్దార్ 101 ఎంపైర్ నూతన బ్రోచర్‌ను శుక్రవారం షీలానగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ గౌతు శిరీష మాట్లాడుతూ, ఈ అద్భుతమైన కొత్త వెంచర్ జాతీయ రహదారిని ఆనుకొని ఎయిర్‌పోర్టుకు 3 కిలోమీటర్ల సమీపంలో నిర్మాణం జరుగుతోందని తెలిపారు. కొత్త వెంచర్ ఫీచర్లను ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా ఉండేలా అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గౌతు శివాజీ, నరెడ్కో సభ్యులు చక్రధర్, రమేష్‌బాబు, గిరి, రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యాన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ముఖ్య అతిథిగా హాజరై సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శతాబ్దాల క్రితం నిర్మించిన రామాలయం శిథిలావస్థకు చేరడంతో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘ సభ్యులు సొంత నిధులతో రామాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు టిడిపి కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, శ్రీకృష్ణ దేవరాయలు కాపు సంఘం ప్రతినిధులు గొర్లె నరసింగరావు, జిఎం.నాయుడు, నారిపిన్ని అప్పలరాజు, సురేష్, గణేష్, గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షుడు దాడి అప్పారావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శనివారం
27 ఏప్రిల్ 2024

కలం మాట



ఇది నిజం.. ఇదీ నిజం.. ఇదే నిజం!

ప్రశ్నించడం మానేస్తే
సమాధానం దొరకదు
సమస్య తీరదు... ఇది నిజం
మేధావులు మౌనం పాటిస్తే
మూర్ఖత్వం మాట్లాడుతుంది
రాక్షసత్వం రాజ్యమేలుతుంది.. ఇది నిజం
మొదటిసారి మోసపోతే
అది అవతలివాడి ప్రతిభ అవుతుందా?
రెండోసారి మోసపోతే...
అది కచ్చితంగా నీ తప్పే ... ఇదీ నిజం
అభివృద్ధి లేని ఆంధ్రప్రదేశ్
రాజధాని లేని రాష్ట్రం
2024లో భవిష్యత్
మన చేతుల్లోనే ఉంది.. ఇదే నిజం

- విశ్వశాంతి (వై.అప్పారావు)
మొబైల్ : 89194 15804

భిక్షం

కష్టాల ఇళ్లలో
కడగండ్లు వండుకుంటూ
పొగ నంజుకుంటున్న మమ్మల్ని..
ఓటు భిక్షం అడగటానికి
సిగ్గు లేదురా!
ఇన్నాళ్ళూ భరించాం
ఇప్పుడు చెప్తున్నాం విను
మా ఓటు నీకు భూతకాలం
నీ నిరంకుశం మాకు వర్తమానం
కానీ...

మా తిరుగుబాటు నీకు
భవిష్యత్ కాలం!!

- చెల్లూరు సాంబమూర్తి
మొబైల్ నెంబరు : 9989423447
స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం

ఎన్ఎడి కూడలిలో సిపిఐ ప్రచారం

ఎన్ఎడి కూడలిలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఐ శ్రేణులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇండియా ఫోరం బలపర్చిన విశాఖ పశ్చిమ నియోజకవర్గ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల శుక్రవారం విమాననగర్, కాకానినగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ, సంపూర్ణ మద్యనిషేధం చేసిన తరువాతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో ప్రజానీకానికి చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి దాని మిత్రపక్షం టిడిపి, జనసేన, బిజెపి నిర్ణయాలన్నింటికీ మద్దతు ఇస్తున్న వైసిపి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ప్రభుత్వరంగ సంస్థల మనుగడ సాధ్యమౌతుందన్నారు. ఇండియా ఫోరం అధికారంలోకి రాగానే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. వామపక్ష అభ్యర్థుల విజయమే రాష్ట్రానికి రక్ష అని అన్నారు. ఈ ప్రచారంలో సిపిఐ, సిపిఎం నాయకులు బి.ప్రభావతి, జి.నారాయణరావు, నారాయణ, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, ఎంఎ బేగం, ఎ.దేముడమ్మ, బి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం

విశాఖ డెయిరీ కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు

విశాఖ డెయిరీ కాలుష్యం గాజువాక నియోజకవర్గ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వందల మంది కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులతో సతమతమ వుతున్నారు. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఆ విషయాన్నే విస్మరించడంతో కాలుష్య సమస్య ప్రజల ప్రాణాలు తీస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీల్లో సిపిఎం మాత్రమే ప్రజల పక్షాన కాలుష్య సమస్యపై పోరాడుతోంది.

- ప్రజాశక్తి -గాజువాక

- పలువురు కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులతో సతమతం
- 30 వేల మందిపై తీవ్ర ప్రభావం
- సొంతిళ్లను సైతం వదిలిపోతున్న పరిసర వాసులు
- నోరెత్తని టిడిపి, వైసిపి
- కాలుష్య నియంత్రణకు ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం

సమీకృత ఆహారం పాలు.. పాలు, పాల పదార్థాలను తింటే ఆరోగ్యానికి మంచిదనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆ పాలను ప్యాకెట్లలో నిల్వ ఉంచేందుకు, వివిధ ఆహార పదార్థాలుగా మార్చేందుకు నిర్వహించే ప్రాసెసింగ్ ప్రక్రియలో వెలువడే నీటి, వాయు కాలుష్యంతో డెయిరీ ప్లాంట్ పరిసర ప్రాంతాల వాసులు నానా అవస్థలకు, అనారోగ్య సమస్యలకు గురవుతూ ఇక్కట్లు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సొంతిళ్లను సైతం వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి అద్దెకు ఉంటున్నారంటే ఇక్కడ ఎంతగా కాలుష్యం వెలువడుతుందో ఇట్టే అర్థమౌతుంది. విశాఖ డెయిరీ కాలుష్యంతో జనం పడుతున్న ఇక్కట్లును దాని యాజమాన్యంగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో జివిఎంసి 68వ వార్డులో దాదాపు 1977లో విశాఖ డెయిరీని నెలకొల్పారు. మొదట్లో వేల నుంచి లక్ష లీటర్ల వరకు పాల సేకరణ చేపట్టి, వాటిని ప్రాసెసింగ్ చేసేవారు. అయితే అప్పట్లో అంతగా కాలుష్యం వెలువడేది కాదు. కాలక్రమేణా విశాఖ డెయిరీ ప్లాంట్ విస్తరణ చేపడుతూ నేడు రోజుకు 9 లక్షల లీటర్ల వరకుపాలను సేకరిస్తోంది. ఈ పాల ప్రాసెసింగ్ ప్రక్రియలో భాగంగా 75 డిగ్రీల సెంటిగ్రేట్ వద్ద వీటిని వేడి చేయాలి. దీనికోసం రెండు బొగ్గు బాయిలర్లు, మరో రెండు ఫర్నెస్ ఆయిల్‌తో నడిచే బాయిలర్స్‌ను నెలకొల్పారు.

ఆయిల్ ధర ఎక్కువగా ఉండడంతో సంబంధిత బాయిలర్స్ నిర్వహణా వ్యయం ఎక్కువ కావడంతో ఎక్కువగా బొగ్గు బాయిలర్స్‌పైనే ప్రాసెసింగ్ చేస్తున్నారు. దీనికోసం రోజుకు టన్నున్నర వరకు బొగ్గు అవసరమౌతున్నట్లు సమాచారం. దీంతో నాణ్యమైన బొగ్గు ధర, సేకరణ కొంత భారంతో కూడుకుని ఉండడంతో నాసిరకం బొగ్గును కొనుగోలు చేసి వాడుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఉదయంపూట బొగ్గు బాయిలర్స్‌ను వినియోగించడంతో వెలువడే పొగ, కాలుష్యం వల్ల ఇబ్బందులు పడ్డ పరిసర ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు పెరగడంతో, ఇప్పుడు రాత్రి సమయంలో బొగ్గును వినియోగిస్తున్నారు.

నాసిరకం బొగ్గుతో తీవ్రమైన దుమ్ము, పొగ కాలుష్యం

పాల ప్రాసెసింగ్ చేసే బాయిలర్స్‌లో నాసిరకం బొగ్గును వినియోగించడం వల్ల, విపరీతమైన దుమ్ము చెలరేగి, పరిసర అక్కిరెడ్డిపాలెం, సింగపూర్ కాలనీ, రాంనగర్, పంచవటి కాలనీ, మింది తదితర ప్రాంతాల్లో బొగ్గు ధూళి జనాలను ఇబ్బందుకు గురిచేస్తోంది. మరోవైపు పొగ కాలుష్యంతో వాటిని పీల్చిన జనాలు అనారోగ్యం పాలౌతున్నారు. ఊపిరితిత్తులు కేన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోపాటు కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికలు ఆవేదన చెందుతున్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌తో ఇద్దరు మహిళలు మృతి చెందారని, ఇంకా ఎందరో అస్వస్థతకు గురై అవస్థలు పడుతున్నారని స్థానికులు చెప్పుకొచ్చారు.

వ్యర్థజలాలతో భూగర్భం విషతుల్యం

డెయిరీలో సేకరించిన పాలను వేడి చేయడానికి ఎస్ఎస్ పైప్‌లైన్స్ కూడా ఉపయోగిస్తారు. ప్రాసెసింగ్ తర్వాత ఆ పైప్‌లైన్లు శుభ్రం చేయడానికి కాస్టిక్ సోడా, సిట్రిక్ యాసిడ్‌ను వినియోగిస్తుండడంతో తర్వాత వచ్చే వ్యర్థజలాలను డెయిరీ వెనక భాగంలో ఉన్న కాలువలోని చిన్న రంధ్రం ద్వారా దొడ్డిదారిన విడిచిపెడుతున్నారు. ఈ కాలువ అక్కిరెడ్డిపాలెం మీదుగా పంచవటి వరకు ప్రవహిస్తుడడంతో దీని ప్రభావంతో అక్కిరెడ్డిపాలెం, సింగపూర్ కాలనీ, పంచవటి కాలనీ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు తాగడానికి వాడిన ఈ ప్రాంత జలాలను ఇపుడు బట్టలు ఉతుక్కోవడానికి కూడా పనికి రానంతగా కాలుష్యమయం అయ్యాయంటే, ఎంతగా ఇక్కడ భూగర్భం విషతుల్యమైందో అవగతం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తాగడానికి, వంటకు నీటిని కొనుక్కోక తప్పని పరిస్థితులున్నాయి. అంతేకాక ఈ వ్యర్థజలాలు, పొగ కాలుష్యంతో తీవ్రమైన దుర్వాసన వెలువడి రాత్రి వేళల్లో వాటి గాఢత వల్ల నిద్ర కూడా పట్టడం లేదని విశాఖ డెయిరీ పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ముక్కుపుటాలను అదరగొట్టే దుర్వాసన తమను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని ఆవేదన చెందుతున్నారు.

డెయిరీ వెనక నుంచి కాలువల్లోకి విడివిపెడుతున్న ప్రాసెసింగ్ వ్యర్థాలు

మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌లోని బాయిలర్స్

ప్రజల గోడు పట్టని ప్రజాప్రతినిధులు, పాలకులు

విశాఖ డెయిరీ కాలుష్య సమస్యపై నాటి ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి నుండినేటి ఎమ్మెల్యే నాగిరెడ్డి వరకు మొత్తంగా టిడిపి, వైసిపిలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు మారినప్పటికీ, డెయిరీ కాలుష్యంపై వీరెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆయా పార్టీలు అపుడు, ఇపుడు, ఎప్పుడూ డెయిరీ యాజమాన్యానికి వత్తాసు పలికేలా వ్యవహరించాయే తప్ప, ప్రజల పక్షాన ఆలోచించిన పాపాన పోలేదు.

అసెంబ్లీలో ప్రస్తావించిన నాటి సిపిఎం ఎమ్మెల్యే గఫూర్

విశాఖ డెయిరీ కాలుష్యంతో ఇక్కడి ప్రజలు పడుతున్న కష్టాలపై రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సిపిఎం ఎమ్మెల్యే గఫూర్ అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. 2005లో ప్రభుత్వం నియమించిన శాసనసభా కమిటీ విశాఖ డెయిరీని సందర్శించి, కాలుష్యంపై నిర్ధారణకు వచ్చింది. డెయిరీ వ్యర్థజలాలను నిల్వ ఉంచడం గానీ, బయట కాలువల్లోకి విడిచిపెట్టకుండా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి, నేరుగా సముద్రంలోకి వెళ్లేలా చూడాలని అప్పట్లో శాసన సభ కమిటీ సిఫార్సు చేసింది. అయితే కమిటీ సూచనలను యాజమాన్యం పెడచెవిన పెట్టింది. తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన అనేక ఆందోళనల ఫలితంగా ఉదయం పూట బొగ్గు బాయిలర్ల వాడకం తగ్గించి మభ్యపెట్టేలా డెయిరీ యాజమాన్యం వ్యవహరించిందే తప్ప, అసలు సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదనిఆరోపిస్తున్నారు.

ఆందోళనలు చేపట్టిన సిపిఎం, ప్రజాసంఘాలు

విశాఖ డెయిరీ కాలుష్యంతో సుమారు 30 వేల మంది ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సిపిఎం మాత్రమే పాదయాత్రలు పోరాటాలు, ధర్నాలు, ఇతరత్రా ఆందోళనలు చేపట్టింది. ఈ సందర్భంగా డెయిరీ యాజమాన్యం ప్రోద్బలంతో పోలీసుల ఆందోళన చేసిన సిపిఎం శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రజల పక్షాన సిపిఎం మాత్రమే పోరాటాలు చేసిన విషయాన్ని ఇప్పటికీ ఇక్కడి వారు గుర్తుచేసుకుంటారు.

అచ్చొచ్చిన ఉప ఎన్నిక..!

- ప్రధాన ఎన్నికల్లో ద్రోణంరాజు కుటుంబీకులకు ఎపుడూ చుక్కెదురే..

పాత జ్ఞాపకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆ తండ్రీ కొడుకులిద్దరికీ అసెంబ్లీ ఎన్నికలు అచ్చిరాలేదు. ప్రధాన ఎన్నికల్లో ఎపుడు పోటీచేసినాగెలవలేకపోయారు. అయితేనేం ఉప ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించి, శాసనసభలోకి అడుగెట్టారు. వివరాల్లోకి వెళ్తే ద్రోణంరాజు కుటుంబం.. విశాఖనగరంలో రాజకీయపరంగా ఎంతో ప్రాముఖ్యత, పలుకుబడి ఉన్న కుటుంబం. ద్రోణంరాజు సత్యనారాయణ కాకలు తీరిన కాంగ్రెస్ నేత. లోక్‌సభ సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, వుడా చైర్మన్‌గా... ఇలా అనేక ముఖ్య పదవులు నిర్వహించారు. ఇన్ని పదవులు నిర్వహించినా.. ఆయనకు శాసనసభకు ఎన్నిక కావాలని, రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందాలనే ఆశ ఉండేది.అయితే దాన్ని సాకారం చేసుకోలేకపోయారు.

1972లో విశాఖ - 2 అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందారు. 1977లో విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి ప్రముఖ నేత తెన్నేటి విశ్వనాథాన్ని ఓడించారు. 1980లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ద్రోణంరాజు సత్యనారాయణకు విశాఖ లోక్‌సభ స్థానం టిక్కెట్టు లభించలేదు. దీనికి ఆయన చింతించలేదు. ఎందుకంటే ఆయన ఆశ, ఆశయమంతా అసెంబ్లీకి పోటీ చేసి గెలవాలనేదే. 1980లో పెందుర్తి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఉన్న గుడివాడ అప్పన్న పదవిలో ఉండగానే మృతి చెందారు. ఆ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ద్రోణంరాజు పోటీచేసి గెలుపొందారు. అసెంబ్లీలో అడుగుపెట్టాలనే కోరికను నెరవేర్చుకున్నారు. అయితే మంత్రి కావాలనే ఆశ తీరలేదు. 1983లో పెందుర్తి నుంచి మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేశారు. అయితే ఈ ప్రధాన ఎన్నికలోనూ టిడిపి ప్రభంజనంలో ఓటమి పాలయ్యారు.

ద్రోణంరాజు సత్యనారాయణ కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాసరావుదీ అదే పరిస్థితి. 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పెందుర్తి నుంచి పోటీచేసి ఓటమి చెందారు. 2004లో ద్రోణంరాజు సత్యనారాయణ విశాఖ -1 నుంచి పోటీచేసి గెలుపొందారు. అయినా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. 2005 డిసెంబర్ 28న పదవిలో ఉండగానే ఆయన మృతి చెందారు. తండ్రి మృతితో ఖాళీ అయిన స్థానంలో 2006 ఏప్రిల్ 24న జరిగిన ఉపఎన్నికల్లో సత్యనారాయణ కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆ విధంగా తండ్రీ కొడుకులు ఇద్దరూ అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు ఉప ఎన్నికల్లో లభించిన విజయాలే కారణంగా నిలిచాయి.

జోరుగా జగ్గునాయుడు ప్రచారం

ఎన్నికల ప్రచారంలో సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడుకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - గాజువాక : జివిఎంసి 66వ వార్డు పరిధిలో భారీ జన సందోహం మధ్య ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వంటిల్లు జంక్షన్ నుంచి సింహగిరికాలనీ, నవాబునగర్, శివాజీనగర్, అజీమాబాద్, ఇందిరాకాలనీ, సీతారాంనగర్‌కాలనీ, బీసీ రోడ్డు మీదుగా కొత్త గాజువాక వరకు ప్రచారం కొనసాగింది. కళాకారుల డప్పు వాయిద్యాలతో, జగ్గునాయుడు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ తనను గెలిపించాలని కోరారు. ప్రజల నుంచి అదే స్థాయిలో స్పందన లభించింది. నవాబు నగర్, శివాజీనగర్‌లో రిటైర్డ్ షిప్‌యార్డు ఉద్యోగి తన ఓటు సిపిఎంకే అంటూ జగ్గు నాయుడుకు పూలు జల్లి ఆశీర్వదించారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. అజీమా బాద్‌లో ముస్లిం నేతను కలిస్తే బిజెపికి వ్యతిరేకంగా పోరాడేది సిపిఎం ఒక్కటేనని అన్నారు. ప్రచారంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎన్. రామారావు, ఎన్.రాజేంద్రప్రసాద్,బంగారునాయుడు, డి.రమణ,ఆర్.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

87వ వార్డులో...

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి సిద్దార్థనగర్, రాజులపాలెం, కణితి హైస్కూల్ రోడ్డు, ఎస్‌సి, కాలనీ, మార్కెట్, దానబోయినపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి సామర్థ్యంతో కూడిన నాయకత్వం కావాలన్నారు. కార్మికులు, ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం అభ్యర్థిని గెలిపిస్తే గాజువాక సమస్యలు పరిష్కరించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో జె.అయోధ్యరాం, ఎం.కృష్ణారావు, పి.శ్రీనివాసరాజు, జగ్గారావు, వి.సంతోష్‌రాజు, కర్రి శ్రీను, దాసరి శివ, ఎస్.సతీష్, కె.నూకరాజు, తారకేష్ పాల్గొన్నారు.

మూడో వార్డులో ముత్తంశెట్టి ప్రచారం

ఎన్నికల ప్రచారంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి కృష్ణాకాలనీ, గొల్లవీధి ప్రాంతాల్లో వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 13న జరుగు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ శ్రీవలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వెయ్యాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి బ్రోచర్లను అందజేశారు.పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచకర్ల విస్తృత ఎన్నికల ప్రచారం

ఎన్నికల ప్రచార రోడ్‌షోలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

ప్రజాశక్తి- సబ్బవరం : కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని బోదువలస గ్రామంలో బిజెపి, టిడిపి, జనసేన బలపరిచిన పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద సభ నిర్వహించి, పెందుర్తి ఎమ్మెల్యేగా తనను గాజుగ్లాస్ గుర్తుపైనా, అనకాపల్లి ఎంపీగా బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌ను కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో పెందుర్తి, సబ్బవరం మండలాల కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

ఎన్ఎఒబి సమస్యలను రాజకీయంగా వాడుకోవడం సరికాదు

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ

ప్రజాశక్తి -అనకాపల్లి

జిల్లాలోని రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలను రాజకీయంగా వాడుకోవడం సరికాదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎఒబి పిఎఫ్, పిడిఎఫ్ ఎనిమిది గ్రామాల ప్రజలు 2022 అక్టోబర్ 31 నుండి 2023 ఏప్రిల్ 5 వరకు 157 రోజుల పాటు సుదీర్ఘ పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొన్నాయని, నాడు నిర్వాసిత జేఏసీ నాయకులు ఢిల్లీ వెళ్లి కేంద్ర డిఫెన్స్ కార్యదర్శిని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి సమస్యలను తెలియజేశారని గుర్తు చేశారు. ఏడాదైనా నేటికీ ఆ సమస్యలను పరిష్కారం చేయని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బుధవారం ఎన్నికల ప్రచారానికి అనకాపల్లి వస్తే టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఆయనకు ఎన్ఎఒబి సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి, టిడిపి, జనసేన నాయకులు రాజకీయంగా లబ్ధిపొందడం కోసం రాజ్‌నాథ్ సింగ్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారన్నారు. ఈ సెంటిమెంట్‌ని ఉపయోగించుకొని టిడిపి, జనసేన, బిజెపి కూటమి లబ్ధిపొందాలని చూడడం సరికాదని, ఇప్పటికైనా ఎన్ఎఒబి నిర్వాసిత ఎనిమిది గ్రామాల సమస్యలు పరిష్కారం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

ప్రమాద బీమా పాలసీలతో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి -అచ్యుతాపురం

తపాల శాఖలో అందుబాటులో ఉన్న ప్రమాద బీమా పాలసీలను చేయడం ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని అనకాపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ అన్నారు. మండలంలోని కొండకర్ల, తిమ్మరాజుపేట, ఎర్రవరం, కాజీపాలెం తదితర గ్రామాల్లో బిపిఎంలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా టాటా ఏఐజి, బిర్లా, బజాజ్ తదితర కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ప్రజలకు నేరుగా బీమా పాలసీలను చేయించే బాధ్యత పోస్టల్ సిబ్బంది ద్వారా చేయడం జరుగుతుందని చెప్పారు. రూ.320 ప్రీమియం చెల్లించిన వారికి రూ.5 లక్షలు, రూ.520 ప్రీమియం చెల్లించిన వారికి రూ.10 లక్షలు, రూ.755 కట్టిన వారికి రూ.15 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు ఈ ప్రమాద బీమా పథకంలో చేరవచ్చని తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి కొన్ని ఆర్థిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పూర్తి వివరాలకు దగ్గరలో ఉన్న పోస్టల్ సిబ్బందిని సంప్రదించి ప్రతి ఒక్కరు ప్రమాద బీమా పాలసీని చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.

ఇండియన్ గ్యాస్ కొరత

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మండలంలో ఇండియన్ గ్యాస్‌కు కొరత ఏర్పడింది. బుక్ చేసి వారం రోజులైనా గ్యాస్ సరఫరా కావడం లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తున్నారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి మండలంలో కొనసాగుతుంది. గ్యాస్ డెలివరీ బాయ్స్‌ని అడిగితే పైనుంచి లారీలు రావడం లేదని చెబుతున్నారు. గ్యాస్ సరఫరాపై సమగ్రంగా విచారణ జరిపి వినియోగదారులకు బుక్ చేసిన వెంటనే సరఫరా చేయాలని కోరుతున్నారు. మండలంలో భారత్ గ్యాస్ బుక్ చేసిన వెంటనే ఇంటింటికి సరఫరా చేస్తున్నారని, ఒక కంపెనీ గ్యాస్ రాకపోతే, మరో కంపెనీకి గ్యాస్ ఎలా వస్తుందని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎక్కువ గ్యాస్ వినియోగదారులు ఉన్న చోట ఎక్కువ గ్యాస్ సరఫరా చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా గ్యాస్ సరఫరాలో ఆటంకాలు కలుగుతున్నాయని చెబుతున్నారు.

అబద్ధాలతో ప్రజలను మోసగిస్తున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశానని పదేపదే అబద్ధాలు చెబుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల్ని మోసం చేస్తున్నాడని టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి వాడిన 'ఒక్క ఛాన్స్' అనే పదం ప్రజలకు వందేళ్ల తరువాత కూడా మరచిపోలేని అతి పెద్ద ప్రతికూల అనుభవం మిగిల్చిందన్నారు. ఐదేళ్ల జగన్ పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడడంతో పాటు బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణగదొక్కబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ఓటేస్తే రాష్ట్రం పరిస్థితి ఏంటోనని ఆలోచిస్తేనే ప్రజలు వణికిపోతున్నారన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పివిఎస్ఎన్.రాజు, టిడిపి నాయకులు కోట్నీ బాలాజీ, గొంప కృష్ణ, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

తలుపులమ్మ తల్లి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని పాచిలవానిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన తలుపులమ్మ తల్లి ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వర శర్మ పర్యవేక్షణలో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను జరిపారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయన్ను దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, దాట్ల శివాజీ రాజు, ఏటుకూరు రాజేష్, సుందరపు గంగాధర్, దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సిఎం బూడి

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి పాలనలో రాష్ట్ర అధోగతి పాలైందని అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆరోపించారు. మండలంలో కొత్తూరులో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో కొణతాల మాట్లాడారు. కార్యక్రమంలో సినీ నటుడు పృథ్వీరాజ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. స్థానిక గవరపాలెం చిన్న రామస్వామి దేవాలయం, దాసరిగెడ్డ రోడ్, అంబేద్కర్ నగర్, విజయరామరాజుపేట, మిరియాల కాలనీ, అన్నపూర్ణ బ్యాంక్, ఏఎంసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కాంగ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జోగినాయుడు ఆధ్వర్యాన కొణతాల రామకృష్ణ ప్రచారం చేశారు. మంత్రి కొణతాల రామకృష్ణను గెలిపించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మండలంలోని ఊడేరు, వెంకుపాలెం,తుమ్మపాల, బవులవాడ పరిసర ప్రాంతాల్లో ఆయన ఉపాధి హామీ కూలీలను కలిసి ప్రచారం చేశారు.

కశింకోట మండలం తేగాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న కొణతాల

ఉపాధి కూలీలతో సమావేశం

కశింకోట : కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు సిఎం రిత్విక్ మండలంలోని కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, జోగారావుపేట గ్రామాలలోని ఉపాధి హామీ కూలీలను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళి, బుదిరెడ్డి గంగయ్య, కర్రి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. మండలంలోని తేగాడ ఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడారు.

మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి

గ్రామాల్లో టిడిపి అభ్యర్థి బండారు ప్రచారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వెంకటరాజుపురం, వాకపల్లి గ్రామాల్లో మాడుగుల నియోజకవర్గం టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి గురువారం రాత్రి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరభాన సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, దొగ్గ దేముడు నాయుడు, చల్లా నానాజీ, కొట్యాడ సామల నాయుడు, పెంటకోట అప్పలనాయుడు, లెక్కల దాలిబాబు, వనుం వెంకటేష్, లెక్కల సూర్యనారాయణ, లెక్కల వెంకటరావు, చప్ప గంగాధర్, జనసేన నేత గొర్రిపోటు రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

సంతలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండల కేంద్రం అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన వారపు సంతలో వైసిపి, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేశారు. డిజిటల్ లైట్లతో రహదారులపై ప్రచారం చేశారు. ఆటోలు, వ్యాన్లపై సంబంధిత పార్టీల హోర్డింగ్‌లు పెట్టి మైకులు ద్వారా ప్రచారం చేపట్టారు.

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

ప్రజాశక్తి-మునగపాక

రానున్న ఎన్నికలలో రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని మాజీ మంత్రి, టిడిపి నాయకులు దాడి వీరభద్రరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రం మునగపాక నందీశ్వర కళా ప్రాంగణం వేదికపై శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇవ్వండి అని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని తన సొంత ఇలాకాగా మార్చుకున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు, బుద్ధ నాగ జగదీశ్వరరావు, ప్రగడ నాగేశ్వరరావు, మండల మండల టిడిపి, జనసేన నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, కర్రి సాయి కృష్ణ, పెంటకోట విజయ్, భీమర శెట్టి శ్రీనివాసరావు, మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా తనిఖీలు

భారీగా పట్టుబడుతున్న మద్యం, నగదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుండి జిల్లాలో ఫ్లైయింగ్ స్క్వాడ్ల ద్వారా తనిఖీలు ముమ్మరం చేశారు. అక్రమ నగదు, మద్యం, కానుకల పంపకాలు, ప్రలోభాలను పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్వరణ్ రాజ్ నేతృత్వంలో 54 ఎఫ్ఎస్‌టి టీమ్‌లు, 54 స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్‌లు సోదాలు నిర్వహిస్తున్నాయి. రెండు రోజులలో పాయకరావుపేట, మాడుగుల, ఎలమంచిలి నియోజకవర్గాలలో చేసిన తనిఖీలలో 165 అక్రమ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మార్చి 16వ తేదీ నుండి జరిపిన తనిఖీలలో మొత్తం రూ.3.25 కోట్లు అక్రమ నగదు, మద్యం తదితరాలు కనుగొని సీజ్ చేశారు. వీటిలో రూ.22.5 లక్షల నగదు, రూ.2 కోట్ల 16 లక్షల విలువైన మద్యం, రూ.59 లక్షల విలువైన గంజాయి, రూ.2.6 లక్షల విలువైన కానుకలు, రూ.22.9 లక్షల విలువైన నాటుసారా పట్టుకున్నారు.

పాలీసెట్-2024కు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో శనివారం జరగనున్న పాలీసెట్ 2024 పరీక్షకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలీసెట్ జిల్లా సమన్వయకర్త ఐవిఎస్ఎన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ పరీక్ష అనకాపల్లిలో 16, నర్సీపట్నంలో 11 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9643 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన విద్య వైద్యం, రవాణా, పోలీస్ రెవెన్యూ విద్యుత్తు, మున్సిపల్ శాఖ అధికారులకు మౌలిక సౌకర్యాలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారని తెలిపారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు ఉదయం 9 గంటలకల్లా చేరుకోవాలన్నారు. విద్యార్థి హాల్ టికెట్, పెన్సిల్ ఎరేజర్, బాల్ పాయింట్ పెన్ బ్లూ లేదా బ్లాక్ తెచ్చుకోవాలని, పరీక్ష కేంద్రాల్లోకి సెల్ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

జూనియర్ లైన్‌మ్యాన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని మునగపాక మండలం చూచుకొండ గ్రామంలో విధి నిర్వహణలో విద్యుత్ షాక్ గురై మృతి చెందిన జూనియర్ లైన్‌మ్యాన్ పీతల శివ సూర్య నారాయణ కుటుంబాన్ని ఎపిఇపిడిసిఎల్ యాజమాన్యం ఆదుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్ఇసిఎస్‌ను ఏపీఈపిడిసిఎల్‌లో విలీనం చేసిన తరవాత ఆర్ఇసిఎస్ ఉద్యోగులను యాజమాన్యం బానిసలుగా చూస్తుందన్నారు. విధి నిర్వహణలో గాయపడిన, మృతి చెందిన వారి పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటన్నారు. కారుణ్య నియామకాల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. మృతుడు శివ సూర్యనారాయణ కుటుంబానికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని దొరబాబు డిమాండ్ చేశారు.

మారెమ్మ పండగకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి -సీలేరు : జికె వీధి మండలం సీలేరులో ఈ నెల 28న జరుగు మారెమ్మతల్లి ప్రధాన పండగకు దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకున్న ఆర్టీసీ అధికారులు విశాఖ నుండి సీలేరుకు రెండు ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టారు. ఒక బస్సు శనివారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం కాంప్లెక్స్‌లో బయలుదేరి నర్సీపట్నం మీదుగా సీలేరు సాయంత్రం ఐదు గంటలు చేరుకుంటుంది. మరో బస్సు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి సీలేరు రాత్రి 8 గంటలకు చేరుకుంటుంది. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం లేదు. ఆది, సోమవారాల్లో మాత్రమే ఒక బస్సును మాత్రమే నడపనున్నారు. ఇంతకుముందు ఉన్న పగటిపూట, రాత్రి తిరిగే నైట్ బస్ సర్వీసులు యథాతథంగా తిరుగుతాయని, ప్రయాణికులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రారెత్తిస్తున్న ఎండలు

- వెలవెలబోయిన వారపు సంత
-నిర్మానుష్యంగా రహదారులు
-వడగాల్పులతో వృద్ధులు, పిల్లలు సతమతం

ప్రజాశక్తి-నక్కపల్లి:సూర్య ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. గత 20 రోజుల నుండి రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం విలవిల లాడుతున్నారు. వేసవికాలం ఆరంభంలోనే ఇలా ఉంటే వచ్చే నెలలో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు భయపడి జనం బయటకు రావడానికి హడలి పోయారు.

నక్కపల్లిలో ప్రతి శుక్రవారం వారపు సంత జరుగుతుంది. మండలంలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో జనం వచ్చి కూరగాయలు కొనుగోలు చేసుకుని తీసుకు వెళ్తూ ఉంటారు. ఎండవేడికి తట్టుకోలేక జనం బయటకు రాక పోవడంతో వారపు సంత వెలవెలబోయింది. సంతలో జనం లేక పోవడంతో బోసిపోయింది. చిరు వ్యాపారులు ఎండ దెబ్బ తట్టుకోలేక గొడుగులు వేసుకుని వ్యాపారాలు సాగించారు. గత కొద్ది రోజుల నుండి ఉదయం 7 గంటల నుండే భానుడు ఎండ తీవ్రతతో విరుచుకు పడుతున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఇళ్లల్లోనూ వేడిగా ఉంటుంది. ఫ్యాన్ వేసుకున్నా వేడి గాలులు వీచడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు పలు జాగ్రత్తలు తీసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

ఎండ తీవ్రత తట్టుకోలేక రోడ్డు పక్కన ఉన్న జ్యూస్ పాయింట్లను ఆచరిస్తున్నారు. మహిళలు చీర కొంగులను కప్పుకుని, గొడుగులు వేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. ముఖ్యంగా పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఎండ తీవ్రతకు మూగజీవాల సైతం ఇబ్బందులు పడుతున్నాయి. బావుల్లో నీరు అడుగంటుకు పోయాయి.

నిర్మానుష్యంగా ఉన్న సంత

చేనేత కుటుంబాలపై కూటమి చిన్నచూపు

- చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:చేనేతలను చిన్నచూపు చూస్తున్న టిడిపి జనసేన బిజెపి కూటమి పార్టీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని అనకాపల్లి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మాడెం సూరిబాబు తెలిపారు. మండల కేంద్రం రావికమతంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, దామాషా లెక్కల ప్రకారం తమకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరు శాసనసభ, 6 లోక్సభ సీట్లు కేటాయించాల్సి ఉండగా కనీసం ఒక్క సీటు కూడా కేటాయించ లేదన్నారు. ఎంపీ, అసెంబ్లీ సీట్లు కేటాయించాలని తాము కూటమిని కోరినప్పటికీ కనీసం ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కోరగా తమ సామాజిక వర్గానికి రెండు సీట్లు కేటాయించారని, 175 నియోజకవర్గాలలో వైసీపీ పార్టీ అభ్యర్థులకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ పప్పు వెంకటరమణ, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డి సురేష్, నెమల రామారావు, మాజీ సర్పంచ్ చింతలూరు, చేనేత సంఘం అధ్యక్షులు కోటం శెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

ఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక ఆర్ఓ కార్యాలయాన్నిఎన్నికల పరిశీలకులు కె.రాకేష్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఆర్వో గీతాంజలి ఆధ్వర్యంలో చేపడుతున్న నామినేషన్ పత్రాల పరిశీలనను ఆయన పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ,ముందస్తు ఏర్పాట్లు, ప్రణాళిక పై చర్చించారు.పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, భద్రత పరమైన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి 11 మంది అభ్యర్థులు నుండి 18 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ మేరకు స్థానిక ఆర్ఓ కార్యాలయంలో శుక్రవారం ఆర్వో గీతాంజలి ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలు పరిశీలించారు..18 నామినేషన్లకు 17 నామినేషన్లు ఆమోదించామని, ఒక నామినేషన్ తిరస్కరించినట్లు ఆర్వో గీతాంజలి వెల్లడించారు. వైసీపీ నుంచి కంబాల సందీప్ (ప్రత్యామ్నాయం)గా దాఖలు చేసిన నామినేషన్ పత్రాన్ని తిరస్కరించినట్లు ఆర్వో గీతాంజలి తెలిపారు.

వైసిపి అభ్యర్థులు జోగులు, గణేష్ ప్రచారం



నక్కపల్లి, నర్సీపట్నం మండలాల్లో ప్రచారం చేపడుతున్న జోగులు, గణేష్, నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని సిహెచ్ లక్ష్మీపురం, జానకయ్య పేట గ్రామాల్లో శుక్రవారం నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలన అందించడం జరిగిందన్నారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని తెలిపారు.తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:మేలు చేసిన వైసీపీకే మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ నర్సీపట్నం అభ్యర్ధి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో 30వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ వైసీపీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ:తనను గెలిస్తే తానొక్కడినే ఎమ్మెల్యేగా ఉంటానని, అదే అయ్యన్నపాత్రుడు గెలిస్తే నలుగురు ఎమ్మెల్యేలుగా చలామణి అవుతారని నర్సీపట్నం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలంలోని సీహెచ్.నాగాపురం, కృష్ణదేవిపేట, కొంగసింగి, ఏఎల్ పురం, లింగం దొరపాలెం, గాదంపాలెం, చోద్యం, లింగందొరపాలెం, అమ్మపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కిలో మీటర్ల ఆరిలోవ రోడ్డును పది రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా అయ్యన్న చేయలేని పనిని తాను చేసి చూపించానన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సాలికమల్లవరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సాలికమల్లవరం గ్రామంలో గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పొగచెట్లపాలెం, వెంకటాపురం నుంచి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. వేసవి దృష్ట్యా అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయ్

ఆసుపత్రిలో నీటి సౌకర్యం ఏర్పాటు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్యపై ఆసుపత్రి వార్డులో చేరిన రోగులు ఇచ్చిన ఫిర్యాదు, వార్తా కథనాలకు స్పందించిన డాక్టర్ గీతాంజలి శుక్రవారం తాత్కాలికంగా నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక ఆరోగ్య కేంద్రంలో బోరుబావి నీరు అడుగంటి పోవడంతో గత రెండు వారాలుగా ఆసుపత్రిలో రన్నింగ్ వాటర్ సమస్య తలెత్తిందన్నారు. నూతన బోరుబావి ఏర్పాటు చేసేందుకు నివేదికలు ఉన్నతాధికారులకు పంపించామ న్నారు. అవసరాలకు వినియోగిం చేందుకు తాత్కాలికంగా తాగునీరు, రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. వారం రోజుల్లో నూతన బోరుబావి ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. నీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో రోగులు, బాలింతలు, గర్భిణీలు ఉపశమనం పొందారు.

ఇంటింటికీ టిడిపి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం నియోజకవర్గంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ చెప్పారు. శుక్రవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, ప్రతీ ఇంటికి తెలుగుదేశం కార్యకర్తలు వెళ్లి అయ్యన్న చేసిన అభివృద్ధిని వివరిస్తారని తెలిపారు. ప్రజల వద్దకే పాలన రానున్న రోజుల్లో జరుగుతుందన్నారు.త్వరలో వైసీపీ పార్టీ తాళాలు వేయబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నేతల ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని శుక్రవారం చిన్న వెదుళ్ళపాలెం, పెద్ద వెదుళ్ళపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం యాత్ర చేపట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి అనిత ఇంటింటా ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు
.

పలువురు చేరిక

ప్రజాశక్తి-నక్కపల్లి:తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని ఎన్.నరసాపురం గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు శుక్రవారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్ ఆమె స్వగృహంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన గట్టెం నాగేశ్వరరావు, అత్తిలి కన్నారావు, దగ్గుబిల్లి వెంకటరావు ,పోతంశెట్టి బాబ్జి తదితరులు వైసీపీని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురుందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, గట్టెం గణేష్, వంగలపూడి శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:రాష్ట్ర భవిష్యత్ కోసం ఎన్డీఏ కూటమిని గెలిపించాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజేపి మండల పార్టీ అధ్యక్షులు గౌరినాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, మండల ప్రధాన కార్యదర్శి రమణ యాదవ్, శివ పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న అనిత

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రజలు సహకరించాలని సీఐ సన్యాసి నాయుడు కోరారు.ప్రతిరోజు ఒక్కొక్క గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.శుక్రవారం ఒడిశా సరిహద్దు గ్రామాలైన కామయ్యపేట, తీగల వలసలో సమావేశం ఏర్పాటు చేశారు.పోలింగ్ బూత్ల వద్ద ఎటువంటి గొడవలు లేకుండా పటిష్ట భద్రతకు ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండకూడదని, ర్యాలీకి వాహనాల అనుమతులు తీసుకోవాలన్నారు. పర్మిషన్ లేకుండా మైక్ సెట్, వెహికల్స్ ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

25వ వార్డులో లక్ష్మీనారాయణ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డులో జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయానికి, అధర్మానికి జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టార్చ్‌లైట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైభారత్ నేషనల్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈలో 'శ్రీవిశ్వ' ప్రతిభ

ప్రజాశక్తి-సీతమ్మధార : జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక మార్కులు సాధించి విజయ పతాకం ఎగరవేశారని కాలేజ్ డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. సాధారణ విద్యార్థులతో ప్రవేశాలు కల్పించి అసాధారణ ఫలితాలను సాధించిందని పేర్కొన్నారు. 1000 ర్యాంకులోపు ఎనిమిది మంది, 5000 ర్యాంకులోపు 30 మంది, పదివేల ర్యాంకులోపు 52 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. దాదాపు 16 మంది విద్యార్థులు 99 శాతం పైగా సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శ్రీవిశ్వ విద్యా సంస్థల చైర్మన్ కె.ధర్మరాజు కళాశాల ఆవరణలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులు 'శ్రీవిశ్వ' ప్రతినిధులు

సమస్యల పరిష్కారంలో గంగవరం పోర్టు నిర్లక్ష్యం

మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి తాతారావు, ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ కార్మికులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిర్వాసిత కార్మికులు 500 మంది ఎలాంటి నైపుణ్యం లేని కార్మికులని న్యాయవాది వైవి రవిప్రసాద్ వాఖ్యానించడం సరికాదన్నారు. నిర్వాసితు కార్మికుల 500 మందికి రూ.22 వేలకుపైగా వేతనాలు చెల్లిస్తున్నట్టు కోర్టులో చెప్పారని, దీనిని రుజువు చేయాలని కోరారు. అత్యధిక మందికి రూ.11,800 నుంచి రూ.17 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ పదే పదే చెప్పినప్పటికీ కార్మికుల నుంచి వినతిని తీసుకుడానికి ఇప్పటికీ యాజమాన్యం ముందుకు రాలేదన్నారు. సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులు గంగవరం పోర్టు చెల్లిస్తున్న వేతనాలతో బతకలేక అప్పుల పాలవుతున్నారన్నారు. పోర్టులో హైస్కిల్డ్ పనులు చేస్తున్న ఆపరేటర్లకు రూ.16 వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. నిర్వాసిత కార్మికుల్లో కూడా నైపుణ్యం కలిగిన వారు ఉన్నప్పటికీ, యాజమాన్యం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. నిర్వాసిత కార్మికులకు నైపుణ్యం లేదని కోర్టులోనే చెప్పడం కార్మికులకు అన్యాయం చేయడమే అన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా : ఆడారి

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా తనకు అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. జివిఎంసి 91వ వార్డు పరిధి బాజీజంక్షన్, ఎస్సీ కాలనీలో కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుతో కలిసి ఆనంద్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలతో కొంత సేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, బూత్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి బైక్ ర్యాలీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా కుమారి కల్యాణ మండపం నుంచి 91, 92 వార్డులలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సుమారు 1000 బైకులతో ర్యాలీ నిర్వహించారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుమారి కల్యాణ మండపం నుంచి గోపాలపట్నం మెయిన్ రోడ్డు మీదుగా బాజీ జంక్షన్, పాత గోపాలపట్నం, ఎస్సీ కాలనీ, లక్ష్మీనగర్ వరకు బైక్ ర్యాలీతో రోడ్ షో నిర్వహించారు. లక్ష్మీనగర్ నుంచి ఇందిరానగర్, గణేష్ నగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు తెలియపరుస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్.ఎ.రెహమాన్, పేడాడ రమణికుమారి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా పశ్చిమంలో బైక్ ర్యాలీ....

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న

డిప్యూటీ తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలి

- జిరాయితీ భూమి యాజమాని పేరు మార్పుపై విచారణ చేపట్టాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికలు నిబంధనలను ఉల్లంఘించి అనకాపల్లిలో ఒక పార్టీకి అనుకూలంగా జీరాయితీ భూములు, ల్యాండ్ పూలింగ్ భూముల్లో లబ్ధిదారుల పేర్లు మార్పు చేస్తున్న అనకాపల్లి డిప్యూటీ తహశీల్దారు యలమంచిలి శ్రీరామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అనకాపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలోని ఖాతా నెంబర్ 1255, సర్వే నెంబర్ 134/23లో 0.68 సెంట్లు భూమి దాకారపు శ్రీనివాసరావు (తండ్రి వెంకటరమణ (లేటు)) పేరుతో ఉందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత అధికారులందరూ ఆ పనిలో వుండగా అనకాపల్లి డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్మూర్తి, పిసినికాడ సచివాలయం సర్వేయర్, విఆర్ఒ కలిసి ఈ 0.68 సెంట్లు భూమిని రీ-సర్వే పేరుతో నూతనంగా ఎల్‌పి నెంబర్ 884తో 0.3480 సెంట్లు చూపించి, సదరు భూ యజమానితో ఎటువంటి సంబంధం లేకుండా 0.34 సెంట్లు తగ్గించడం జరిగిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పిసినికాడ సచివాలయం సర్వేయర్‌ను వివరణ కోరగా టైం అయిపోవడంతో హడావిడిగా డిప్యూటీ తహశీల్దారు ఆదేశాల మేరకు అలా చేశామని, తాను కేవలం సర్వే మాత్రమే చేస్తానని, టైటిల్ చూడవలసిన బాధ్యత విఆర్ఒ, డిటిలపై వుందని, తనకు సంబంధం లేదని బుకాయించారని పేర్కొన్నారు. దాకారపు శ్రీనివాసరావుకు చెందిన ఈ భూమికి 2024 ఏప్రిల్ 10వ తేదీ వరకు ఎటువంటి ఎల్‌పి నెంబరు కేటాయించలేదని, ఈనెల 25వ తేదీ చూసే సరికి రీ-సర్వే చేసినట్లు, దీనికి 884 ఎల్‌పి నెంబరు కేటాయించినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తుందని తెలిపారు. 2024 మార్చి 1న అనకాపల్లి ఆర్టిఒ పరిశీలించగా అప్పటికీ దాకారపు శ్రీనివాసరావు పట్టా నెంబరు 1255 వున్నట్లుగా ధ్రువీకరించడం జరిగిందని, ఎన్నికలు కోడ్ అమలులో వుండగా భూ యజమానికి ఎటువంటి సమాచారం లేకుండా అధికారపార్టీ నాయకులు అదేశాలు మేరకు కొంత మందికి లబ్ధిచేకూర్చే విధంగా డిటి తన సొంత మనసులను ప్రైవేట్‌గా నియమించుకొని రికార్డులను తారుమారు చేసినట్లు చెప్పారు. ఇదే విధంగా ల్యాండ్ పూలింగ్ భూములకు కూడా సంబంధంలేని వారి పేర్లతో తప్పుడు రికార్డులు సృష్టించి కొంత మందికి డిటి సహకరిస్తున్నారని విమర్శించారు. స్థానిక ఆర్డీఒ తను చేయాల్సిన పనిని అనకాపల్లి డిప్యూటీ తహశీల్దారుకి అప్పగించడంతో ఇదే అవకాశంగా తీసుకొని, ఒక పార్టీకి నాయకులు చెప్పిన వారి పేరుతో భూమి రికార్డులు మార్చుతున్నారని తెలిపారు. కావున అనకాపల్లి డిప్యూటీ తహశీల్దార్‌పైనా, ఆయనకు సహకరిస్తున్న రెవెన్యు అధికారులపైనా తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి భరత్‌కుమార్

ఉపాధి హామీ కూలీలను కలిసిన భరత్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి అసెంబ్లీ వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ శుక్రవారం మండలంలోని పాపయ్యపాలెం, పాపయ్య సంతపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పనిచేస్తున్న కూలీలను కలిశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మే 13న జరుగు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తులపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, సర్పంచ్ అన్నం అప్పారావు, ఉప సర్పంచ్‌లు గంగిరెడ్డి గోవింద, నానాజీ, మంగ నాయుడు, మువ్వల రాజు, గొల్లవిల్లి గోవిందు పాల్గొన్నారు.

టిడిపి నుండి వైసిపిలో పలువురు చేరిక

మండలంలోని తగరంపూడి గ్రామంలో టిడిపి నాయకులు యాదగిరి రామచంద్రరావు, యాదగిరి బాబ్జి, బొడ్డు కనక, గంట పోలినాయుడు, గొలగన భాస్కరరావు, మిస్క ఏసు, గొల్లగాని హరి, ముమ్మినీ ఈశ్వరరావుతో సహా 20 మంది టిడిపి కార్యకర్తలు శుక్రవారం వైసీపీలో చేరారు. అనకాపల్లి అసెంబ్లీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసిపిలో చేరిన యాదగిరి రామచంద్రరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో భరత్ కుమార్ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పెద్దిశెట్టి గోవింద, గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ అయితి ఆనంద రాము, నాయకులు ఎన్నంశెట్టి సత్యనారాయణ, నాగులపల్లి నరసింహనాయుడు పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా మేధో సంపత్తి దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐఐసీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంతో అనుబంధంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేటెంట్ల పాత్రపై అంతరదృష్టిని అందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వ్యాపార రంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలపై చర్చించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రిసోర్స్ పర్సన్ వై బాబ్జి పేర్కొన్నారు. పేటెంట్లు ఆవిష్కరణలకు, వాటి ప్రత్యేక హక్కులను మంజూరు చేసే చట్టపరమైన సాధనాలుగా పనిచేస్తాయని, తద్వారా పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ.దేవి ప్రసాద్, డిపార్ట్‌మెంట్ ఆర్‌అండ్‌డి కోఆర్డినేటర్ వివి ప్రసన్నకుమార్, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

29న సిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి



ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో ఈనెల 29వ తేదీన జరుగు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చోడవరం అనకాపల్లి మెయిన్ రోడ్డు పక్కన సభాస్థలి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆ రోజు ఉదయం 9 గంటలకు చోడవరం చేరుకుంటారని, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.